# చీర్యాల లక్ష్మీనృసింహ స్వామి సేవలో..

కీసర: చీర్యాల లక్ష్మీనృసింహస్వామి సేవలో బుధవారం తెలంగాణ రాష్ట్ర స్పెషల్ సెక్రటరీ బోయి విజయేందిర, మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్, జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య పాల్గొన్నారు. ఉదయం దేవాలయానికి విచ్చేసిన వీరికి ఆలయ వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. గర్భాలయంలో కొలువైన శ్రీస్వామివారి ప్రత్యేక పూజల అనంతరం ఆలయ వేదపండితులు వారికి స్వామివారి ఆశీర్వచనం, మహాప్రసాదాన్ని అందజేశారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్తశ్రీహరిగౌడ్ స్వామివారి చిత్రపటాలను బహూకరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 3వ తేదీన తెలంగాణ రైతు దినోత్సవం సందర్భంగా కీసరలోని రైతు వేదిక వద్ద నిర్వహించనున్న కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఆర్డీఓ రవికుమార్, తహసీల్దార్ గౌరివత్సల, కీసర సర్పంచ్ నాయకపు మాధురి, మండల వ్యవసాయాధికారి మాధవిలత తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మీనృసింహస్వామి సేవలో రాష్ట్ర స్పెషల్ సెక్రటరీ విజయేందిర


కలెక్టర్ అమయ్‌కుమార్


అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య


కీసరలోని రైతు వేదికను పరిశీలిస్తున్న రాష్ట్ర స్పెషల్ సెక్రటరీ విజయేందిర, కలెక్టర్ అమయ్‌కుమార్ తదితరులు

## క్లుప్తంగా...

### మహాసభల వాల్‌పోస్టర్ విడుదల


వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మేడ్చల్: ఈ నెల 6, 7వ తేదీల్లో మేడ్చల్‌లో నిర్వహించే మున్సిపల్ కార్మిక సంఘం వాల్ పోస్టర్‌ను మేడ్చల్‌లో ఏఐటీయూసీ నాయకులు విడుదల చేశారు. మేడ్చల్‌లో రాష్ట్ర మున్సిపల్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ 3వ మహాసభలను మేడ్చల్‌లో నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. మహాసభలో మున్సిపల్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

### పర్యావరణ హితం కోసం పనిచేయాలి


నూతన్‌కల్‌లో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సర్పంచ్, తదితరులు

మేడ్చల్: గ్రామాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు పర్యావరణ హితం కోసం పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బయోడైవర్సిటీ ప్రతినిధులు పర్యావరణంపై అవగాహన కల్పించారు. ప్రజాప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణ పరిరక్షణ కోసం చేయాల్సిన పనులు, చేస్తున్న పనులను వివరించారు. మండలంలోని రాయిలాపూర్, నూతన్‌కల్ తదితర గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించారు.

### 'మెడిసిటిపై చర్యలు శుభపరిణామం'

మేడ్చల్: మండలంలోని ఘనాపూర్‌లోని మెడిసిటి మెడికల్ కళాశాలపై నేషనల్ మెడికల్ కమిషన్ చర్యలు తీసుకోవడం శుభపరిణామమని రాష్ట్ర ఎస్‌ఎఫ్‌ఐ ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్ అన్నారు. మెడికల్ కమిషన్ కళాశాలలో ఈ సంవత్సరం అడ్మిషన్లు రద్దు చేసిన విషయం, వసతులు కల్పించని అన్ని కళాశాలలకు ఒక హెచ్చరిక అన్నారు. మెడిసిటి మెడికల్ కళాశాలలో మౌలిక వసతులు లేకపోవడంతో అడ్మిషన్లు రద్దు చేయడం మంచి పరిణామమని అన్నారు. రాష్ట్రంలో మిగతా ప్రాంతాల్లో ఉన్న మెడికల్ కళాశాలలను తనికీ చేసి వసతులు కల్పించని వాటిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

### ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు మంగళంపల్లి తిరుపతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జవహర్‌నగర్ ప్రధాన రహదారిలో నిత్యం వేలాది వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయని, నూతనంగా వేసి రహదారిలో వాహనాలు వేగంగా వెళ్తున్నాయన్నారు. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనాలు వేగంగా వెళ్తుండటంతో పక్కన వెళ్లే వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకముందే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

### దశాబ్ది ఉత్సవాలకు నూతన పాట


పాట రాసిన కవి కొండల్‌రావు

మేడ్చల్: రాష్ట్రం ఏర్పడి 10 ఏళ్లు గడుస్తున్న సందర్భంగా మేడ్చల్‌కు చెందిన తెలుగు పండితుడు కవి శ్రేష్ట కొండల్‌రావు నూతన పాటను రచించారు. మేడ్చల్‌కు చెందిన కవి శ్రేష్ట గుండవరం కొండల్ రావు ప్రైవేట్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ కవితలు రాస్తున్నాడు. ఇటీవల తెలుగు అకాడమి నుంచి కవి శ్రేష్ట బిరుదును పొందారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మా తెంగాణ తల్లికి తంగేడు పూల దండ, మాకన్న తల్లికి మంగళహారతులు పాటను రాశారు. పాటను అత్వెల్లి సెయింట్ క్లారెట్ పాఠశాలలో నిర్వహించే దశాబ్ది ఉత్సవాల్లో ఆవిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# గుడ్డుపై ముద్ర.. పక్కదారికి అడ్డుకట్ట..

## పౌష్టికాహారం దుర్వినియోగం కాకుండా చర్యలు



- కోడిగుడ్డుపై 'అంగన్‌వాడీ గుడ్డు' ముద్ర
- జూన్ నుంచి అమలుకు యంత్రాంగం కసరత్తు
- జిల్లాలో 793 కేంద్రాల్లో 81,329 మంది లబ్ధిదారులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం.. పూర్వ ప్రాథమిక విద్య బలోపేతమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. వీటి ఆధ్వర్యంలో ప్రభుత్వం నెల నెలా కోడిగుడ్డు, ఇతర పౌష్టికాహార సరకులు పంపిణీ చేస్తోంది. అయితే కొందరు అక్రమార్కుల కక్కుర్తితో అవి పక్కదారి పడుతున్నాయి. మరోవైపు కుళ్లిన చిన్న గుడ్లు సరఫరా చేస్తుండటంతో చెత్త పాలవుతున్నాయి. ఈ క్రమంలో సమగ్ర శిశు సంక్షేమ శాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. అక్రమాలను నియంత్రించేందుకు ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఇకపై ప్రతి కోడిగుడ్డుపై 'అంగన్‌వాడీ గుడ్డు' అని ఉన్న ముద్ర వేస్తున్నారు. జూన్ నెలలో ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది.

### పక్కదారి పడుతున్న సరకులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిన మూడేళ్లలోపు చిన్నారులకు బాలామృతం, గుడ్లు, ఆరేళ్లలోపు వారికి గుడ్లు, పప్పు, కూరగాయల భోజనం, అల్పాహారం, బలవర్థకమైన పల్లిపట్టీలు అందిస్తున్నారు. ఆరోగ్యలక్ష్మి పథకంలో ప్రతిరోజూ 200 మి.లీ. పాలు సరఫరా చేస్తున్నారు. బరువు తక్కువగా, బలహీనంగా ఉన్న వారికి రెట్టింపు స్థాయి పౌష్టికాహారం పంపిణీ అవుతోంది. అయితే అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉండటంతో సరుకులు పక్కదారి పడుతున్నాయి. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. అంగన్‌వాడీ లబ్ధిదారులకు కోడిగుడ్డు పంపిణీలో పాలకుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. చాలాచోట్ల కేంద్రాలకు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు రావడం లేదు. లబ్ధిదారుల పేరిట నెలనెలా వస్తున్న కోడి గుడ్లు, ఇతర సరకులను సిబ్బంది మింగేస్తున్నారు.'

### నెలలో మూడు రంగులో..

జిల్లా పరిధిలో మొత్తం 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిలో 70,027 మంది చిన్నారులు, 11,302 మంది గర్భిణులు, బాలింతలు నమోదయ్యారు. కోడిగుడ్ల పంపిణీలో అక్రమాలను నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని అమలు చేస్తోంది. నెలలో పది రోజులకోసారి కోడిగుడ్లపై ప్రత్యేక రంగుతో కూడిన ముద్రను వేస్తోంది. మొదటి విడతలో నీలి, రెండో విడతలో ఎరుపు, మూడో విడతలో ఆకుపచ్చ రంగుల్లో 'అంగన్‌వాడీ గుడ్డు' మధ్యలో ముద్రించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 జోన్ల పరిధిలో కాంట్రాక్టర్లకు బాధ్యతలు ఇచ్చారు. కుళ్లిపోతే వారే బాధ్యత వహించాల్సి ఉంటుంది. మూడు రంగుల ముద్ర ఉండటంతో దుర్వినియోగానికి అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నాణ్యమైన గుడ్లు సరఫరా చేయడం లేదు. కుళ్లిపోయిన, చిన్న పరిమాణంలో ఉన్న గుడ్లను తినేందుకు లబ్ధిదారులు నిరాసక్తత కనబరుస్తున్నారు. కొన్నిచోట్ల కేంద్రాలకు తీసుకురాకుండానే సిబ్బంది గుడ్లను అమ్ముకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

### లబ్ధిదారులకు పక్కాగా పౌష్టికాహారం

అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన చిన్నారులు, బాలింతలు, గర్భిణుల సంపూర్ణ ఆరోగ్యం కోసం నెలనెలా కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నాం. సరఫరాలో అక్రమాలు లేకుండా పంపిణీ చేసేందుకు మూడు రంగుల్లో ముద్ర వేస్తున్నాం. జూన్‌లో ముద్ర ఉన్న కోడిగుడ్లనే పంపిణీ చేయనున్నాం. దీంతో లబ్ధిదారులకు పక్కాగా పౌష్టికాహారం అందనుంది.

– అక్కేశ్వర్‌రావు, జిల్లా ఇన్‌చార్జి సంక్షేమ అధికారి, మేడ్చల్–మల్కాజిగిరి

# కనకదుర్గాదేవి ఆలయ నిర్మాణానికి భూమిపూజ


దమ్మాయిగూడలో కనకదుర్గాదేవి అమ్మవారి ఆలయ భూమిపూజలో మంత్రి మల్లారెడ్డి

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో బుధవారం కనకదుర్గాదేవి ఆలయ నిర్మాణ భూమిపూజలో మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌన్సిలర్ సంపనబోలు స్వప్నహరిగౌడ్ ముందుకొచ్చి కాలనీవాసులతో కలిసి ఇక్కడ కనకదుర్గాదేవి అమ్మవారి ఆలయం నిర్మించేందుకు పనులు ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. దేవాలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. అనంతరం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని సీతారామచంద్ర స్వామి నూతన ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠతోపాటు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు స్వప్నహరిగౌడ్, శ్రీహరిగౌడ్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొకుట్ల తిరుపతిరెడ్డి, మాదిరెడ్డి పావనిరెడ్డి, నేతలు శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

## రాష్ట్రంలోని ప్రతి గ్రామం అభివృద్ధి సాధించింది

### రూ.7 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు

శామీర్‌పేట: రాష్ట్రంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందిందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. బుధవారం ఉమ్మడి శామీర్‌పేట మండలంలో ఆయన పర్యటించారు. శామీర్‌పేట మండలంలో రూ. 6 కోట్ల నిధులతో (సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, బస్టాప్, ఎస్సీ కమ్యూనిటీ హాల్, మార్కెట్ యార్డు)లను మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. అనంతరం మూడుచింతలపల్లి మండలంలోని పోతారం, కొల్తూర్, మూడుచింతలపల్లి, లక్ష్మాపూర్, ఉద్దమర్రి, ఆద్రాస్‌పల్లి, జగ్గంగూడ గ్రామల్లో రూ.62.65 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, యూజీడీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి గ్రామం అవార్డు అందుకునేలా బ్రహ్మాండంగా రూపుదిద్దుకున్నాయని, అన్ని వర్గాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ పథకాలను ప్రవేశపెడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు యెల్లుబాయి, హారిక, జెడ్పీటీసీ అనిత, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేత రాహుల్‌ను కలిసిన ప్రశాంత్‌రెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: అమెరికా పర్యటనలో భాగంగా శాన్‌ఫ్రాన్సిస్కో విమానాశ్రయానికి చేరుకున్న కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీని ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు శామ్ పిట్రోడా, కేపీఆర్‌ఐటీ విద్యా సంస్థల వైస్ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ నెల 4న న్యూయార్క్‌లో భారతీయ సంతతి ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నట్లు వారు తెలిపారు. శాన్‌ఫ్రాన్సిస్కోలోని ప్రతిష్టాత్మక యూనివర్సిటీ విద్యార్థులతో రాహుల్ సంభాషించే అవకాశం ఉందన్నారు.

# మున్సిపల్‌లో కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఏసురత్నం

మేడ్చల్: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికులకు కాంట్రాక్ట్ వ్యవస్థ శాపంగా ఉందని ఏఐటీయూసీ రాష్ట్ర మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నం, ప్రధాన కార్యదర్శి మంద వెంకటేశ్వర్లు అన్నారు. మేడ్చల్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ మున్సిపాలిటీల్లో కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి కార్మికులందరినీ శాశ్వత ఉద్యోగులుగా మారుస్తామని చెప్పినా అది అమలు కాలేదన్నారు. సిబ్బందిని రెగ్యులరైజ్ చేసి నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కలిపించాలని డిమాండ్ చేశారు. 10వ పీఆర్సీ వేతణ సవరణను అమలు చేయకపోతే మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసనలు, ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. మేడ్చల్‌లో ఈ నెల 6, 7 తేదీల్లో ఏఐటీయూసీ మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు జైపాల్‌రెడ్డి, జయచంద్ర, డాక్టర్ రాములు, శేఖర్, అశోక్, శశిధర్‌రెడ్డి, నర్సింహ, భారతమ్మ, నర్సింగ్‌రావు, శ్రీను పాల్గొన్నారు.

# కొర్రెముల్‌లో పౌర హక్కుల దినోత్సవం



ఘట్‌కేసర్: కొర్రెముల్ గ్రామంలో నాయబ్ తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్ అధ్యక్షతన బుధవారం పౌర హక్కుల దినోత్సం ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ అధికారి భాస్కర్‌రెడ్డి స్థానికులకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాయబ్ తహసీల్దార్ మాట్లాడుతూ రాజ్యాంగం పౌరులందరికీ సమానంగా పౌర హక్కులు ప్రసాదించిందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వినోద, వార్డు సభ్యులు ఆంజనేయులు, స్వామి, సుష్మ, బాబు, మాజీ ఉప సర్పంచ్ నాగార్జున, రవి పాల్గొన్నారు.

# లీకేజీలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు


మరమ్మతులు చేయిస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్

ఘట్‌కేసర్: నీటి సరఫరా పైపులైన్ల మరమ్మతుల విషయంలో ఆలస్యం చేయకూడదని, యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని చైర్ పర్సన్ పావనీయాదవ్ మున్సిపల్ సిబ్బందికి సూచించారు. మున్సిపాలిటీలోని పదో వార్డులో మిషన్ భగీరథ వాటర్ లీకేజీలకు బుధవారం మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ పగిలిన పైపులను గుర్తించి ఎప్పటికప్పుడు పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్, జంగయ్యయాదవ్, మాజీ వార్డు సభ్యుడు దేవేందర్‌ముదిరాజ్, ఆంజనేయులు, నజీర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సీఐకి సత్కారం



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ నూతన సీఐ మహేందర్ రెడ్డిని మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, టీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రమాదేవి, ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు, ఎఫ్‌ఎస్‌సీఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, అన్నుబాయ్, కపానిధి, విజయ్‌గౌడ్, సిరాజ్, మురళిగౌడ్, జంగారెడ్డి, ఎస్సైలు నాగార్జున్‌రెడ్డి ధనంజయ పాల్గొన్నారు.

## శామీర్‌పేట కట్టమైసమ్మ ఆలయం వద్ద ఏర్పాట్ల పరిశీలన



శామీర్‌పేట్: భావితరాలు గుర్తుంచుకునేలా మేడ్చల్ జిల్లాలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని కలెక్టర్ అమోయ్‌కుమార్, రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల మేడ్చల్ జిల్లా ప్రత్యేక అధికారి బోయి విజయిందిరా అన్నారు. శామీర్‌పేట కట్టమైసమ్మ ఆలయంతో పాటు పెద్ద చెరువు పరిసరాలను అధికారులతో కలిసి వారు పరిశీలించారు. పర్యటనలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, డీపీఓ పద్మజరాణి, ఆర్డీవో రవి, ఇరిగేషన్ డీఈ సురేష్, డీఏఓ మేరీ రేఖ, హార్టికల్చర్ అధికారి నీరజాగాంధీ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## 8 నుంచి మల్లారెడ్డి ట్రోఫీ సీజన్–2 క్రికెట్ పోటీలు

కీసర: కీసర మండలంలో జూన్ 8, 9, 10వ తేదీల్లో మల్లారెడ్డి ట్రోఫీ సీజన్–2 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు తటాకం భానుశర్మ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువత ఈ క్రికెట్ పోటీల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. వివరాలకు ఫోన్: 98488 17732, 97053 93630.

## ఘన నివాళి

బోడుప్పల్: సినీ నిర్మాత బొమ్మక్ మురళి కుటుంబ సభ్యులను బుధవారం సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి పరామర్శించారు. మురళి మాతృమూర్తి లక్ష్మినర్సమ్మ మంగళవారం పరమపదించగా ఆమె మృతదేహానికి కీరవాణి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# నోటరీ ప్లాట్ల చీటింగ్ కేసులో ఇద్దరి అరెస్ట్

జవహర్‌నగర్: నోటరీ ప్లాట్ల చీటింగ్ కేసులో ఇద్దరు నిందితులు అరెస్ట్ అయిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జ్యోతి కాలనీకి చెందిన లక్ష్మణ్(52), అతడి కుమారుడు పవన్(26)లు 2019లో జవహర్‌నగర్‌లోని సర్వే నెంబర్–697, 808, 809లో ఉన్న ప్లాట్లను ఖమ్మంజిల్లాకు చెందిన రమాదేవికి విక్రయించారు. కొన్ని రోజుల తర్వాత రమాదేవి కొన్న స్థలం వద్దకు వెళ్లడంతో అక్కడ గతంలోనే ప్లాట్లు కొన్నవారు ఉన్నారు. దీంతో రమాదేవి ప్లాట్లు అమ్మిన లక్ష్మణ్‌ను నిలదీయడంతో డబ్బులు తిరిగి చెల్లిస్తామంటూ చెప్పి తిరుగుతూ మోసం చేశారు. దీంతో ఆమె జవహర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు లక్ష్మణ్, పవన్‌లపై చీటింగ్ కేసు నమోదు చేశారు. ఈ నెల 29వ తేదీన లక్ష్మణ్ కోర్టులో లొంగిపోగా, పవన్‌ను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## హనుమాన్‌కు కరోనా వారియర్ అవార్డు



ఘట్‌కేసర్: బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు, ఘట్‌కేసర్‌కు చెందిన విప్పర్ల హనుమాన్‌ను కరోనా వారియర్ అవార్డు వరించింది. కరోనా సమయంలో ఆయన పేదలకు అందించిన సేవలకు 'ది లీడర్స్ పేజ్' స్వచ్ఛంద సంస్థ ఆయనకు అవార్డు అందజేసింది. పట్టణంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆ సంస్థ రాష్ట్ర కార్యనిర్వాహణాధికారి నర్సింహయాదవ్ ఆయనకు అవార్డు, మెమొంటో అందజేసి సత్కరించాడు. విజయ్‌కుమార్, లక్ష్మారెడ్డి, మైపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వీరేశం, విక్రాంత్‌రెడ్డి, శివ, సుభాషిణి, మాధవి, ఆశ, సంతోష్ పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



మేడ్చల్‌రూరల్: సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరమని గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీ అన్నారు. సీఎం సహాయనిధి లబ్ధిదారులైన ఉన్నిగోల్ల లావణ్యకు రూ.42,500, డి.వేణుకు రూ.32,500ల చెక్కులను ఆమె బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, బలరాజ్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యా వలంటీర్‌కు వేతనం అందజేత

ఘట్‌కేసర్: అవుషాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందన్న విద్యార్థుల తల్లిదండ్రుల విన్నపం మేరకు గ్రామ సర్పంచ్ కావేరి మశ్చేందర్‌రెడ్డి దంపతులు ఓ విద్యా వలంటీర్‌ను గతంలో నియమించారు. సర్పంచ్ దంపతుల సొంత డబ్బుతో వలంటీర్ మూడు నెలల వేతనం రూ.10 వేలను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, ప్రవీణ్ స్థానికులు పాల్గొన్నారు.



# సేవాభావంతో ఆస్పత్రులు నిర్వహించాలి

## ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు


సన్‌సీడ్ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

కుషాయిగూడ: ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు వ్యాపార దృక్పథంతో కాకుండా సేవాభావంతో నిర్వహించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. కుషాయిగూడ– నాగర్జుననగర్ కాలనీ మెయిన్ రోడ్డుపై ఏర్పాటు చేసిన సన్‌సీడ్ ఆస్పత్రిని బుధవారం ఆయన ఎంపీ బీబీ పాటిల్, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఆస్పత్రిలో అందించే వైద్యసేవలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ అన్వేష్ మాట్లాడుతూ తనవంతుగా పేదలకు వైద్య సాయం అందించాలనే సంకల్పంతోనే ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్యం కోసం వచ్చే పేదలకు ప్రత్యేక రాయితీపై వైద్యం అందించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టుల కుటుంబాలకు 40 శాతం రాయితీపై వైద్యం అందిస్తామన్నారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, పజ్జూరి పావనీరెడ్డి, ఆసుపత్రి ఎండీ డాక్టర్ తేజస్వీని, సీఈఓ రాములు, డాక్టర్ భానుచందర్, డాక్టర్ లావణ్య, డాక్టర్ నాయక్, స్థానిక నేతలు పాల్గొన్నారు.